## క్లుప్తంగా

### ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



అబ్దుల్ సలాంను సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

కొడంగల్ రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న అబ్దుల్ సలాంను ఆదివారం పట్టణంలోని మక్కా మసీద్‌లో మాజీ సర్పంచ్ ఎస్.ఎం.గౌసస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్.. ఈ నెల 5న జిల్లా కేంద్రంలో జిల్లా ఉన్నతాధికారుల చేతులమీదుగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో అబ్దుల్ కరీం, అశ్రఫ్, షేక్ ఆదిల్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ జబ్బార్, సయ్యద్ ఇసాక్ పాష తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో రేవంత్‌రెడ్డి

దౌల్తాబాద్: మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి సహా గ్రామానికి చెందిన వంద మంది బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రావు, వెంకట్‌రెడ్డి, రెడ్డి శ్రీనివాస్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న కార్మికుల సమ్మె



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె ఆదివారానికి 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించని యెడలా రాష్ట్ర స్థాయి కమిటీ పిలుపు మేరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు చిన్నయ్య, రాజు తదితరులు ఉన్నారు.

### కురుమలు రాజకీయాల్లో రాణించాలి



నాగప్పను సన్మానిస్తున్న కురుమలు

తాండూరు రూరల్: కురుమలు రాజకీయాల్లో రాణించాలని కుర్మ సంఘం తాండూరు డివిజన్ ప్రతినిధులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడిగా నియమితులైన గౌతాపూర్ గ్రామానికి చెందిన జెన్నె నాగప్పను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నాగప్ప పార్టీ మండల అధ్యక్షుడు కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన కటికె కాశమ్మ(85) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలకు తక్షణ సహాయంగా ఆరెకటిక సంఘం తరఫున బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో సంఘం మండల అధ్యక్షుడు కాశీనాథ్, బాబుజీ, రాజు ఉన్నారు.

### ఉత్సవాలకు విరాళం

కద్లాల్: పోచమ్మ బోనాల ఉత్సవాలకు, ఆలయ అభివృద్ధి కోసం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్–గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సంయుక్తంగా రూ.40 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఆదివారం ట్రస్ట్ చైర్మన్‌లు జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త ఆలయ నిర్వాహకులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బోనాలను ఐక్యమత్యంతో నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతలను ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, ఉప సర్పంచ్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# నిద్దరోతున్న నిఘానేత్రాలు

మండలంలో నిఘా వ్యవస్థ నీరుగారిపోతోంది. సీసీ కెమెరాలు ఉండి పనిచేయకున్నా.. పోలీసు అధికారులు వాటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. తొలుత ఒక్క సీసీ వందమంది పోలీసులతో సమానమని, నేరాల నియంత్రణే కాదు.. చిక్కుముడితో వీడని కేసులను సైతం మూడోనేత్రం సహాయంతో గట్టెక్కించవచ్చని విస్తృత ప్రచారం చేసిన పోలీసులు.. తీరా ఏర్పాటు అనంతరం వాటి బాగోగులు మరిచారు. దీంతో అవి ఉండి నిద్రపోవడం గమనార్హం.

- పనిచేయని సీసీ కెమెరాలు
- తగ్గిన పోలీసుల గస్తీ
- పట్టించుకోని అధికారులు

పెద్దేముల్: నేర నియంత్రణ కోసం మండలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిద్రపోతున్నాయి. ఒక్క సీసీ వందమంది పోలీసులతో సమానమని, దొంగతనాలు, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు నిజనిర్ధారణ చేసి, కేసుల గుట్టు విప్పేందుకు అవి ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రజలు, వ్యాపారులు సహకరించాలంటూ సీసీలను ఏర్పాటు చేయించడంలో సఫలమైన పోలీసులు.. వాటి పర్యవేక్షణ గాలికి వదిలేశారు. దీంతో అవి పనిచేయకుండా పోయాయి.

**వరుస ఘటనలతో సీసీల ఏర్పాటు**

వికారాబాద్ జిల్లాలో పెద్దేముల్ మండలం కర్ణాటక రాష్ట్రం సరిహద్దుకు మూడు కిలో మీటర్ల దూరం ఉంది. గతంలో మండల కేంద్రంలో విజయ, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంకుల్లో దొంగతనాలు, తట్టెపల్లిలో వరుస చోరీలు చోటుచేసుకోవటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దీంతో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అప్పట్లో పోలీసు ఉన్నతాధికారుల కృషితో మండల కేంద్రంతో పాటు పరిధిలోని మంబాపూర్, ఇందూరు, గాజీపూర్, కందనెల్లితండా, గోట్లపల్లి, హన్మాపూర్ తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మండల కేంద్రంలో మూడు, మిగతా గ్రామాల్లో అక్కడక్కడా కొన్ని పనిచేస్తున్నాయని పోలీసులు తెలిపారు.



పనిచేయని సీసీలను తొలగించడంతో బోసిపోయిన కెమెరాల స్టాండ్లు

**సరిహద్దునే కర్ణాటక**

మండలంలోని 37 జీపీలతో పాటు సుమారు ఎనమిది అనుబంధ గ్రామాలు ఉన్నాయి. 45 వేలకు పైగా జనాభా ఉంది. కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ఎన్నికలు, ఇతర సమయాల్లో పోలీస్ ఉన్నతాధికారులు సరిహద్దు ప్రాతంలోని బండమీదిపల్లి సమీపంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా తాండూరు–హైదరాబాద్, తాండూరు–సంగారెడ్డి, తాడూరు–జహిరాబాద్ ప్రధాన రోడ్డు మార్గాలు ఉన్నాయి. నిత్యం ఈ దారుల్లో వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఈ ప్రాతంలో సుద్ద, ఎర్రమట్టి ఖనిజాలతో పాటు సుద్ద, పత్తి పరిశ్రమలు ఉన్నాయి. వీటిల్లో ఒడిస్సా, రాజస్థాన్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన కూలీలు అధికంగా పనిచేస్తారు. రోడ్డు ప్రమాదాలు కూడా అనేకం చోటుచేసుకుంటాయి.

**దారి దోపిడీ ఘటనతో సీసీల ఏర్పాటు**

ఐదేళ్ల క్రితం తాండూరు–జహిరాబాద్ ప్రధాన మార్గంలో పెద్దేముల్ మండలం గోట్లపల్లి–తాండూరు మధ్య రాత్రి వేళలో దారి దోపిడీ జరిగింది. దీంతో పోలీసులు పెట్రోలింగ్‌తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం కెమెరాలు పనిచేయక పోవడంతో పాటు పెట్రోలింగ్ తగ్గిందని పరిసర ప్రాంత ప్రజలు చెప్పడం గమనార్హం. అంతే కాదు పోలీస్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో ఉన్న సీసీలు కూడా పనిచేయటం లేదు. కొంతకాలం క్రితం వరకు సీసీలు కేవలం పట్టణాల్లోనే ఉండేవి. నేరాలు పెరుగుతుండటంతో పల్లెల్లోనూ కెమెరాలు ఏర్పాటు చేయటంతో గ్రామీన ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తంచేశారు. 2018 సంవత్సరంలో మండలంలోని 20 గ్రామాల్లో 50 వరకు సీసీ కెమెరాలు స్థానిక సర్పంచ్‌ల సహకారంతో ఏర్పాటు చేశారు.

**కొరవడిన పోలీసు సిబ్బంది**

ప్రస్తుతం సీసీ పనిచేయకపోవటం, పోలీసుల పెట్రోలింగ్ తగ్గిపోవడంతో దొంగతనాలు, దారి దోపిడీలు, అధికమయ్యాయని, నేరాలు, రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు స్పందించి పనిచేయని సీసీ కెమెరాలను మరమ్మతు చేయించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పోలీసుల గస్తీ విస్తృతం చేయాలని కోరుతున్నారు. అంతే కాకుండా ఠాణా పరిధిలో ఒక ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుల్, 21 మంది పోలీసులు అవసరం ఉండగా, ప్రస్తుతం ఎస్ఐ, ఒక ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్, 15 మంది పోలీసులు పనిచేస్తున్నారని, కర్ణాటక సరిహద్దున ఉన్నందున సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఫిర్యాదు చేయండి**



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కానున్నాయి. పోలీస్ పెట్రోలింగ్ సక్రమంగానే ఉంది. ఎవరైనా గ్రామాలకు రాకుంటే ఫిర్యాదు చేయండి. చర్యలు తీసుకుంటాం. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం తాగి ఇబ్బందులకు గురిచేస్తే సమాచారం ఇవ్వండి. ప్రజలు పోలీసులకు సహకరించండి.

– కాశీనాథ్, ఎస్ఐ, పెద్దేముల్

# హలో ముదిరాజ్.. చలో పరిగి



సన్నాహక సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్‌లు

- గుర్తించని రాజకీయ పార్టీలు
- 15న పోరుగర్జన
- హక్కుల సాధనకు కదిలి రండి: ముదిరాజ్‌లు

కుల్కచర్ల: ముదిరాజ్‌లను బీఆర్‌ఎస్ పార్టీ చిన్నచూపు చూస్తుందని, సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఒక్క ఎమ్మెల్యే టికెట్ కూడా కేటాయించపోవటం చాలా బాధాకరమని సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు రామస్వామి అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల, ఇప్పాయిపల్లి, చాపలగూడెం, ముజాహిద్‌పూర్ గ్రామాల్లో స్థానిక ముదిరాజ్ సంఘాల నేతలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. హలో ముదిరాజ్ చలో పరిగి అంటూ.. హక్కుల సాధనకై పోరుబాటకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముదిరాజ్‌ల సంఖ్య అధికంగా ఉన్నా, రాజకీయ పార్టీలు గుర్తించడం లేదని విమర్శించారు. రిజర్వేషన్ల పోరాటానికై ఈ నెల 15న పరిగి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న ముదిరాజ్ పోరుగర్జనకు ముదిరాజ్‌లు పెద్ద ఎత్తున తరలి రావాలని, స్పందన చూసి ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. పార్టీలకు అతీతంగా పోరుగర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హన్మంతు, మైపాల్, వెంకటయ్య, రాములు, గోవర్ధన్, అంజి, రాజు ఉన్నారు.

# బీజేపీ తాండూరు టికెట్‌కు పోటాపోటీ

తాండూరు టౌన్: బీజేపీ తాండూరు శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కోసం మరో ఇద్దరు నేతలు ఆదివారం అధిష్టానానికి అర్జీ పెట్టుకున్నారు. పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, పట్టణ కౌన్సిలర్ సాహు శ్రీలత, నాయకుడు నరేష్ మహరాజ్ తాజాగా దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే మురళీ కృష్ణ గౌడ్, రమేష్ కుమార్, పటేల్ రవి శంకర్, జయశ్రీ పటేల్, లక్ష్మారెడ్డిలు అర్జీ పెట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో ఇద్దరు పోటీ పడటంతో వారి సంఖ్య ఏడుకు చేరింది. అయితే వీరిలో టికెట్ ఎవరిని వరిస్తుందో చూడాల్సిందే.



టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న శ్రీలత

# ఉచిత కంటి వైద్య శిబిరం

ధారూర్: శ్రీ సత్యసాయి సేవాసమితి, సావిత్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కేరెల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. ఇందులో 90 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి వారికి అద్దాలు పంపిణీ చేశారు. మరో 35 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయాలని చెప్పారు. చికిత్సం నిమిత్తం 20 మందిని సాధురం కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సమన్వయకర్త చిరంజీవి రెడ్డి, శిబిరం సమన్వయ కర్తలు యాదగిరి, రామకృష్ణ, సత్యసాయి సార్వజనిక కేంద్రం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

# దోచుకునేందుకే వారి చెలిమి!

- తాండూరు గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయం
- బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్

తాండూరు టౌన్: తాండూరును దోచుకునేందుకే మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు ఒక్కటయ్యారని బీజేపీ తాండూరు అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శనివారం తాండూరులో 'మా ఇద్దరి కలయికను చూసి అన్ని పార్టీలు భయపడుతున్నాయి' అని మంత్రి పట్నం, ఎమ్మెల్యే రోహిత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తాండూరు గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని భయపడి, ఆ ఇద్దరూ ఏకమయ్యారని దుయ్యబట్టారు. కేవలం పదవుల కోసమే ఇద్దరూ కలిశారనే విషయం తాండూరు ప్రజలకు తెలుసునని, అదే ప్రజలు రాబోయే ఎన్నికల్లో వారిని ఓడిస్తారని పేర్కొన్నారు. ఈసారి తాండూరులో బీజేపీ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# మట్టి వినాయకుడికి జై



మట్టి విగ్రహాలకు కుందన్స్ అంటిస్తున్న తిరుమలేశ్ కుటుంబ సభ్యులు

- పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా విగ్రహాల తయారీ
- మట్టి ప్రతిమలపై భక్తులకు అవగాహన కల్పిస్తున్న తిరుమలేశ్

కొడంగల్ రూరల్: చవితి పండుగ సమీపిస్తుండటంతో మట్టి వినాయకుడి ప్రతిమలకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. పర్యావరణహితంకోరే భక్తులు మట్టి గణపతులను ప్రతిష్ఠించడానికి మక్కువ చూపుతున్న నేపథ్యంలో తనవంతుగా ఓ కళాకారుడు విగ్రహాలను తయారు చేస్తూ పర్యావరణంపై భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు.

**ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్..**

గాంధీనగర్ కాలనీకి చెందిన ఒప్పంద ఉపాధ్యాయుడు, డ్రాయింగ్ మాస్టర్ తిరుమలేశ్ కొన్నేళ్లుగా మట్టి గణనాథులను తయారు చేసి విక్రయిస్తున్నారు. చిత్రకళపై మక్కువతో ఇతను చిన్ననాటి నుంచి ప్రముఖ కళాకారుడు బసవలింగప్ప దగ్గరకు శిక్షణ తీసుకున్నారు. అక్కడే విగ్రహాల తయారీలో మెలకువలు నేర్చుకున్నాడు. మరింత నైపుణ్యం కోసం నాలుగేళ్లు చెన్నైలో శిక్షణ పొందాడు. అనంతరం కొడంగల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఒప్పంద డ్రాయింగ్ మాస్టర్‌గా చేరారు. అయితే రెండేళ్లుగా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మట్టి విగ్రహాల అమ్మకానికి శ్రీకారం చుట్టాడు. భక్తులకు మట్టి విగ్రహాల ప్రాముఖ్యత వివరిస్తూ విక్రయిస్తున్నాడు. సెలవు రోజుల్లో విగ్రహాల తయారీలో పలువురికి శిక్షణ ఇచ్చాడు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసే విగ్రహాలకు ఏ మాత్రం తీసిపోకుండా మట్టి విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి అమ్మకానికి పెట్టారు.

**ప్రయోగాత్మకం..**

23 ఏళ్లుగా విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నాను. ప్రస్తుతం ట్రెండ్‌ను బట్టి ప్రతిమలను ప్రయోగాత్మకంగా తీర్చిదిద్దుతున్నాం. విగ్రహాలకు కుందన్స్, డ్రెస్ ఫిట్టింగ్, శాలువా, పంచా (దోతి) కడుతున్నాం. గురువు నేర్పించిన ఈ కళ ఎంతో ఉపయోగపడుతుంది. చవితి వస్తుందంటే మా కుటుంబం మొత్తం ఇందులో నిమగ్నమైపోతాం.

– తిరుమలేశ్, డ్రాయింగ్ మాస్టర్, కొడంగల్

# వీరనారి చాకలి ఐలమ్మ

తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని వక్తలు అన్నారు. ఆదివారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లాలో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. దొరల పాలన నుంచి తెలంగాణ విముక్తి, పేదల భూమికోసం, భుక్తికోసం ఉద్యమించిన యోధురాలు అని కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



పరిగి: ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు



కుల్కచర్లలో..



తాండూరు టౌన్‌లో.. నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



పూడూరు: మన్నేగుడ చౌరస్తాలో..



దారూరు: నివాళి అర్పిస్తున్న సర్పంచ్ చంద్రమౌళి తదితరులు



దౌల్తాబాద్‌లో..



కొడంగల్ రూరల్: రజక సంఘం ఆధ్వర్యంలో..

# ఒక్క చాన్స్ ప్లీజ్!

కుల్కచర్ల: పరిగి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ నుంచి అవకాశం కల్పించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘనపురం వెంకటయ్య గౌడ్ తరపున ఆయన కుమారుడు రాఘవేందర్ గౌడ్, అనుచరులు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం దరఖాస్తు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. సుదీర్ఘకాలంగా పార్టీలో వెంకటయ్య పనిచేస్తున్నారని, ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజేశ్వర్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు అందజేస్తున్న వెంకటయ్య అనుచరులు

# అధికారం వస్తే రూ.500కే సిలిండర్

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

కేశంపేట: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఆయన కోరారు. ఆదివారం చౌలపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమం షాద్‌నగర్‌లోని శంకర్ గృహంలో నిర్వహించారు. బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, వార్డు సభ్యులు రాములు, దర్శన్, మల్లయ్య, శేఖర్, చంద్రయ్య, కృష్ణయ్య, లక్ష్మయ్యలకు పార్టీ కండువాలు కప్పి శంకర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రతీ కార్యకర్త ఇంటింటికి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని విషయాన్ని వివరించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన వెంటనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.

**కొండారెడ్డిపల్లిలో...**

మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో చౌడమ్మ, గొర్ల పోశమ్మ బోనాలను పురస్కరించుకొని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజాలు నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండేవిధంగా చూడాలని ఆయన కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, రావుల పెంటయ్య, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



కేశంపేట: కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో వీర్లపల్లి శంకర్

**నమ్మితే మోసపోవడం ఖాయం**

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మూడోసారి నమ్మి అధికారం ఇస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని శంకర్ ఆరోపించారు. నర్సప్పగూడ గ్రామంలో నిర్వహించిన 'తిరగబడదాం–తరిమికొడదాం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నమ్మి అధికారం కట్టబెడితే అర్హులకు డబుల్ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వకుండా మళ్లీ మోసం చేస్తారని విమర్శించారు. తొమ్మిదేళ్ల నుంచి రుణమాఫీని పట్టించుకోని కేసీఆర్ ఎన్నికలు సమీపిస్తుండడంతో రుణమాఫీ చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు.

**సాయుధ పోరాట యోధురాలు**

షాద్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని పట్టణంలో ర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఐలమ్మ విగ్రహానికి నాయకులు నివాళి అర్పించారు.